
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

బుధవారం 30 ఏప్రిల్ 2025



ఎన్‌హెచ్ 365బీ అలైన్‌మెంట్ మార్పునకు కేంద్రం అంగీకారం

- రైతులకు నష్టం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం
- ఫలించిన ఎంపీ రఘునందన్‌రావు చొరవ

7

మోమిన్‌పేటలో ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనలో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న నిర్మలా జగ్గారెడ్డి

స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలికిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా లోని మోమిన్‌పేట మండలంలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్ పనులకు శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అన్నివర్గాల అర్హులకు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబులు ఎంతోగానో కృషి చేస్తున్నారని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి స్పష్టం చేశారు.



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న నిర్మలాజగ్గారెడ్డి

రైతుల ఇబ్బందులు దూరం చేసేందుకే 'భూ భారతి'

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

8

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం రూ.78.94 కోట్లు

- సంగారెడ్డి జిల్లాలో 71,232 దరఖాస్తులు
- తిరస్కరణకు గురైనవి 22,512
- నేటితో ముగియనున్న ఎల్‌ఆర్‌ఎస్ గడువు



పటాన్‌చెరు నీటిపారుదలశాఖ కార్యాలయంలో నిరభ్యంతర పత్రం కోసం ఎదురుచూస్తున్న ప్లాట్ల యజమానులు

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అనధికార ప్లాట్లు, అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లింపునకు ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించగా, నేటితో గడువు ముగియనున్నది. సంగారెడ్డి జిల్లాలో దరఖాస్తుదారులు చెల్లించిన ఎల్‌ఆర్‌ఎస్ రుసంతో రూ.రూ.78.94 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలో 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. 71,232 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులు ఇంటింటికీ వెళ్లి విచారణ జరిపారు. ఆయా దరఖాస్తులను మూడు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి విచారించారు. ఎవరికి వారు ప్రభుత్వం అందించిన యాప్‌లలో వివరాలు నమోదు చేసేటట్టు అవకాశం కల్పించారు. వాటిల్లో ప్రభుత్వ, అసైన్డ్, చెరువులు, కుంటలతో పాటు ఆలయాల భూముల్లోని ఇళ్లస్థలాలకు సంబంధించిన దరఖాస్తులను తిరస్కరించారు. జిల్లాలో 22,512 దరఖాస్తులు ఎటువంటి విచారణకు నోచుకోలేదు. 48,720 మంది ఫోన్‌లకు ఎస్‌ఎంఎస్ విధానం ద్వారా సమాచారం పంపితే అందులో 14,865 మంది స్పందించి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. ఆన్‌లైన్ విధానం సక్రమంగా పని చేయకపోవడం వల్ల 2,830 మందికి మాత్రమే ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు.

తెల్లాపూర్‌లో అత్యధికంగా రూ.28.38 కోట్లు

జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో మొత్తం మొత్తం రూ.78.94 కోట్లు వసూలు అయ్యాయి. తెల్లాపూర్‌లో అత్యధికంగా రూ.28.38 కోట్ల ఆదాయం వచ్చింది. దీని తరువాత అమీన్‌పూర్ రూ.24.43 కోట్లు, సంగారెడ్డి రూ.11.48 కోట్ల రాబడి సమకూరింది. గడ్డపోతారం రూ.1.48 కోట్లు, ఐడీఏబొల్లారం రూ.1.26 కోట్లు, అందోల్ - జోగిపేట రూ.18 లక్షలు, జహీరాబాద్ రూ.2.66 కోట్లు, గుమ్మడిదల రూ.1.44 కోట్లు, సదాశివపేట రూ.1.56 కోట్లు, కోహీర్ రూ.3లక్షలు, నారాయణఖేడ్ రూ.1.49 కోట్లు, ఇస్నాపూర్ రూ.4.55 కోట్లు వసూలయ్యాయి.



విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నందవరం కృష్ణమాచారి ఐఐటీ హైదరాబాద్‌లో సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. భార్య పిల్లలతో కలిసి పాత కందిలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ నెల 26న ఇంటికి తాళం వేసి సొంతూరికి వెళ్లారు. ఈ క్రమంలోనే అదను చూసుకుని దొంగలు తాళం పగులగొట్టి చొరబడ్డారు. బీరువాలో భద్రపరిచిన బంగారు గాజులు, చైన్లు, ఉంగరాలు, బ్రాస్లెట్, చెవి కమ్మలు ఇతర ఆభరణాలు మొత్తం 40 తులాల బంగారు నగలను దోచుకెళ్లారు. వెండి వస్తువులు, నగదును ముట్టుకోలేదు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

బంగారమే టార్గెట్

పసిడి ఆభరణాలను దోచేస్తున్న దొంగలు

- ధరలు అమాంతం పెరగడంతో చోరీలు కన్ను
- తాళాలు వేసిన ఇళ్లపైనే దృష్టి
- వేసవి సెలవుల నేపథ్యంలో ఊరెళ్లే వారు జాగ్రత్త



సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. రాకెట్‌లా దూసుకెళుతున్నాయి. దీంతో భారీగా సొమ్ము చేసుకునేందుకు దొంగలు పెద్ద ఎత్తున నగలను దోచేస్తున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో వారి ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఇటీవల తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తించడం, రాత్రిపూట కొల్లగొట్టడం చేస్తున్నారు. ఇటీవల కొన్ని ఇళ్లల్లో జరిగిన చోరీల్లో నగదు, వెండి ముట్టకుండా కేవలం బంగారు ఆభరణాలను మాత్రమే దోచుకెళ్లారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. పగటి పూట పాత ఇనుప సామగ్రి కొంటామని తదితర వంకతో కాలనీలు, బస్తీల్లో తిరుగుతుంటారు. ఆ సమయంలో ఏఏ ఇళ్లకు తాళాలు ఉన్నాయో, ఏ ఇంట్లో మనుషులు లేరో తెలుసుకుంటారు. రాత్రి సమయంలో తాళం వేసిన ఇళ్లల్లో వాలిపోయి దొంగతనాలకు పాల్పడుతున్నారు. పాఠశాలలు, కాలేజీలకు వేసవి సెలవులు రావడంతో కొంతమంది తమ సొంత ఊళ్లకు పయనమవుతారు. అయితే, వారి వద్ద ఉన్న బంగారం, వెండి, నగదు తదితర విలువైన వస్తువులన్నీ బీరువాల్లోనే దాచిపెట్టి

మూడేళ్లుగా జరిగిన చోరీల వివరాలు

సంవత్సరం	2022	2023	2024
పగటి వేళ	36	55	46
రాత్రుల్లో	167	197	215
సాధారణ దొంగతనాలు	495	420	639
గొలుసు చోరీలు	13	15	21

మిగతా 8వ పేజీలో

అనుమానితులపై సమాచారం ఇవ్వండి



జిల్లాలో వివిధ గ్రామాల్లో చోరీ కేసులపై దృష్టి సారించాం. పట్టణాల్లో, వివిధ గ్రామాల్లో రాత్రి వేళల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. పట్టణాల్లో, గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు లేదా 100 నంబరు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆ ఇళ్లపై గట్టి నిఘా ఉంచుతామన్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదువుంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని, ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లితే వాటిని తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేస్తే అవి కనిపించకుండా కర్టెన్లు వేయాలని, చుట్టు పక్కల వారికి తమ ఇళ్లను ఓ కంట కనిపెట్టాలని సూచించాలన్నారు. ప్రజల సహకారంతోనే దొంగతనాలు నివారించవచ్చని చెప్పారు. పట్టణాలు,గ్రామాల్లో యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గస్తీలు ముమ్మరంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

\- పరితోష్ పంకజ్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ



అవును.. చేతితో గీసినవే

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ చిత్రలేఖనంలో రాణిస్తున్న యువతి
- ఆకట్టుకుంటున్న నాగశృతి గీసిన చిత్రాలు

7



విత్తన సంపదను కాపాడుకుందాం

- చిరుధాన్యాల్లోనే పోషకాలు అధికం
- డీడీఎస్-కేవీకే సలహాదారు డా.గౌరీశంకర్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య

7

బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారాలను ఎండగట్టాలి

- ఆ పార్టీలు సోషల్‌మీడియాకు రూ.కోట్లల్లో ఖర్చు చేస్తున్నాయి
- రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

మెదక్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ సోషల్‌మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ పిలుపునిచ్చారు. మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో మంగళవారం జిల్లాస్థాయి విస్తృత కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర పరిశీలకులు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, వరప్రసాద్ కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారం చేయడానికి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 46 లక్షల సభ్యత్వాలు కలిగి ఉన్నదన్నారు. రానున్న రోజుల్లో ఊహించని విధంగా విజయాలను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో పర్యటించి కార్యకర్తలను కలుస్తామని తెలిపారు. మే నెలాఖరు వరకు పర్యటించి జిల్లా, బ్లాక్, మండల, గ్రామస్థాయి కార్యవర్గాల నిర్మాణాలపై నివేదిక సమర్పిస్తామని వివరించారు. ఈ సమావేశంలో ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, దుబ్బాక, నర్సాపూర్, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్

'నీట్'కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్రం
- హాజరు కానున్న 487 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మే 4న నిర్వహించనున్న నీట్-2025 పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేశ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు డిగ్రీ కళాశాలలో నీట్‌కు పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న పరీక్షకు మొత్తం 487 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, నిరంతర విద్యుత్, శానిటేషన్, తరగతి గదుల శుభ్రత, బెంచీలు, బస్ సదుపాయం వంటి మౌలిక సదుపాయాలన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ కే.హుస్సేన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు, ప్రిన్సిపాల్‌లు హాజరయ్యారు.

వైద్య శాఖలో మళ్లీ నోటిఫికేషన్

- పాత దానికి పాతర.. కొత్తగా జారీ
- 117కు పెరిగిన పోస్టులు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ
- ఈసారైనా భర్తీకి అడుగులు పడేనా?

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కింద వివిధ పోస్టుల భర్తీకి ఆ శాఖ అధికారులు మంగళవారం మళ్లీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు వివిధ విభాగాల్లో పనిచేసేందుకు 117 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించారు. మే 3న దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అయితే, దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

ఏడాది గడిచాక..

జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద 2024 ఫిబ్రవరి 27 న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 97 పోస్టుల భర్తీకి గతేడాది అధికారులు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుమారు 3500కుపైగా దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. అయితే ఇందులో ఎంబీబీఎస్ డాక్టర్, ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు తప్ప మిగతా వాటి భర్తీకి చర్యలు తీసుకోలేదు. ఎన్నికల కోడ్‌తో ఆలస్యమైందని, పై నుంచి పెద్దాయన ఆపమన్నారని ఇతరత్ర కారణాల చూపి నియామకాలు చేపట్టకుండా అధికారులు పక్కన పెట్టారు. తీరా ఏడాది కాలం గడిచిపోయింది. ఇంకేముంది పాత నోటిఫికేషన్ రద్దు అయినట్లే భావించిన అధికారులు తాజాగా మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ జారీ చేశారు.

నోటిఫికేషన్‌లో అస్పష్టత !

జిల్లాలో వివిధ పోస్టుల భర్తీకి చేపట్టిన నియామకాల నోటిఫికేషన్‌లో పూర్తిస్థాయిలో స్పష్టత లేదు. పనిచేసే ప్రాంతం, వేతనం, రోస్టర్ కూడా నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. అయితే, గతేడాది 97 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, ప్రస్తుతం తాజా నోటిఫికేషన్‌లో ఆ పోస్టుల సంఖ్యను 117కు పెంచారు. ఆయా పోస్టుల భర్తీ జరిగే క్రమంలో అభ్యర్థుల నుంచి అధికారులు, ఉద్యోగులు డబ్బులు వసూలు చేస్తారనే ఆరోపణలున్నాయి. నోటిఫికేషన్‌లో వివరాలు స్పష్టంగా పేర్కొనకపోవడంపై అభ్యర్థులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

చెత్తకుప్పలోకి పాత దరఖాస్తులు

కొత్త నోటిఫికేషన్ జారీపై గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియామకాల కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నామని, ఉద్యోగాలు వస్తాయని ఎంతో నమ్మకంతో దరఖాస్తు చేసుకుంటే నిరాశే మిగిల్చారని వాపోయారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి కారణంగానే ప్రక్రియ ముందుకు సాగలేదని వారు మండిపడ్డారు. గత నోటిఫికేషన్ రద్దు చేయబడిందని, మళ్లీ ఫ్రెష్‌గా దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో తమ దరఖాస్తులు చెత్తకుప్పలో పడేయడం సరికాదని, వాటిని పరిగణలోకి తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.



సంగారెడ్డిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

మంత్రి ఇలాఖాలోనే ఈ పరిస్థితా?

వైద్య ఆరోగ్య శాఖ తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌పై కొత్తగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది దరఖాస్తు చేస్తే ఏడాది కాలం ముందుకు సాగనీయకుండా పక్కన పెట్టిన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌తో ఉద్యోగాలు భర్తీ చేస్తారా లేదా అన్న మీమాంసలో అభ్యర్థులు ఉన్నారు. స్వయాన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగారెడ్డి జిల్లాలోనే ఈ పరిస్థితి ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

వెల్దుర్తి/జహీరాబాద్/నాగల్‌గిద్ద ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. ఈ మేరకు మంగళవారం వారి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

వెల్దుర్తిలో


చల్ల కొమురమ్మ

బంధువుల ఇంటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన వెల్దుర్తిలోని శేరి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరి గ్రామానికి చెందిన చల్ల కొమురమ్మ(46) 45 రోజుల క్రితం బాగిర్తిపల్లిలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో అప్పటి నుంచి ఎక్కడ వెతికినా ఆచూకీ లేదు. దీంతో కొమురమ్మ కూతురు అలివేణి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాగల్‌గిద్దలో


తెనుగు అంజన్న

కిరాణా సామాన్లు తీసుకువస్తానని చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైయ్యాడు. గ్రామానికి చెందిన తెనుగు అంజన్న(42), ఈనెల 28న ఉదయం 10 గంటలకు నారాయణఖేడ్ వెళ్లి కిరాణా సామాన్లు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాక పోవడంతో బంధువుల, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అంజన్న భార్య సావిత్రి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై బి.సాయిలు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 7893492520, 8712656762 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

జహీరాబాద్‌లో


ద్యారంగుల స్వప్న

పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన ద్యారంగుల స్వప్న(20) అదృశ్యమైంది. జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. బాగారెడ్డిపల్లికి చెందిన కేశప్ప కూతురైన ద్యారంగుల స్వప్న పట్టణంలోని భవాని మందిర్ వద్ద ఓ టైలర్ షాపులో టైలరింగ్ నేర్చుకుంటుంది. రోజూ మాదిరిగానే స్వప్న ఈ నెల 25న టైలర్ షాపుకు వెళ్లింది. ఎంతవరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకుల, ఇరుగు, పొరుగు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లేదు. దీంతో యువతి తండ్రి కేశప్ప జహీరాబాద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాశీనాథ్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● రూ. లక్షావేల ఆస్తి నష్టం ● తప్పిన పెను ప్రమాదం

తొగుట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సుమారు రూ.లక్ష 35వేల వరకు ఆస్తినష్టం జరిగింది. ఈ సంఘటన మంగళవారం తొగుట మండలం కాన్గల్ గ్రామంలో జరిగింది. నాయిని ఎల్లవ్వ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించి తక్షణ చర్యలు చేపట్టారు. దాంతో పెనుప్రమాదం తప్పింది. ఎల్లవ్వ ఇంట్లోని బియ్యం, దుస్తులు, అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1లక్ష 35వేల వరకు ఆస్తినష్టం కలిగినట్లు రెవెన్యూ అధికారి అశోక్ రాజ్ తెలిపారు.




మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, కూలిపోయిన ఇల్లు

తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్య

మద్దూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించినందుకు కొడుకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ఎర్రబచ్చల బలరాం కుమారుడు చంద్రకాంత్(24) ఏ పనిపాట లేకుండా ఇంటి వద్దనే ఉంటుండటంతో ఏదైనా పని చేసుకుని కుటుంబానికి అండగా నిలవాలని తండ్రి మందలించడంతో చంద్రకాంత్ ఫ్యానుకు ఉరివేసుకుని చనిపోయాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మహబూబ్ తెలిపారు.

అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా


బోల్తాపడ్డ లారీ

రామాయంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట శివారు జాతీయ రహదారిపై ధాన్యం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద ఘటనలో డ్రైవర్, క్లీనర్లు క్షేమంగా బయటపడ్డారు. వరి ధాన్యం లోడ్ చేసుకొని రామాయంపేట వైపు వస్తుండగా లోడ్ అధికమై ఒక్కసారిగా డ్రైనేజీ కాలువలో పడిపోయింది.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య

వర్గల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అంబర్‌పేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్, రేణుక దంపతుల చిన్న కూతురు జ్యోతి(17) కూచారం కస్తూర్బా గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. పరీక్షలు పూర్తి కావడంతో అంబర్‌పేట గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. మంగళవారం సాయంత్రం జ్యోతికి కడుపు నొప్పి రావడంతో భరించలేక సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జ్యోతికి కొంత కాలంగా విపరీతమైన కడుపు నొప్పి వస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




అవును.. చేతితో గీసినవే..

ఆకట్టుకుంటున్న నాగ శృతి గీసిన చిత్రాలు




చేగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫోటోగ్రఫీలా కనిపిస్తున్న ఈ చిత్రాలన్నీ.. చేతితో గీసినవే. ఎలాంటి శిక్షణ లేకుండానే అనేక దేవతా మూర్తుల చిత్రాలను గీసి శభాష్ అనిపించుకుంటున్నది మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గడ్డం నాగ శృతి. బీటెక్ పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం టెక్ మహీంద్రాలో ఉద్యోగం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి ఉండటంతో సమయం దొరికినప్పుడల్లా దేవతామూర్తుల చిత్రాలను గీస్తూ కళా నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారు. వినాయకుడు, పార్వతీ పరమేశ్వరులు, వేంకటేశ్వరుడు, అలవేలుమంగా, శ్రీకృష్ణుడు, గోవులు, గోపికలు వంటి అనేక చిత్రాలను వేసి ఔరా అనిపించారు. పెయింటింగ్‌కు కావలసిన అమెరికన్ డైమండ్స్, 22 క్యారెట్ గోల్డ్ పూత రంగు తదితర ముడిసరుకును తంజావూరు నుంచి తెప్పించుకుంటారు. మూడులు నెలలు శ్రమించి వేంకటేశ్వరస్వామివారి చిత్రాన్ని గీశారు. దీనికోసం రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినట్లు నాగశృతి తెలిపారు. స్వామివారి చిత్రపటాన్ని నేడు అక్షయ తృతీయను పురస్కరించుకుని ఓ స్వచ్ఛంద సంస్థకు బహూకరించనున్నట్లు తెలిపారు.



తాను గీసిన వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో నాగశృతి

మర్కుక్ మండలానికి అరుదైన అవకాశం

● ఎస్ఆర్‌పీలుగా ఇద్దరు ఎంపిక




చిన్నబ్రహ్మయ్య, రాధాకృష్ణ

మర్కుక్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్(ఎస్ఆర్‌పీ)ల ఎంపికలో మర్కుక్ మండలానికి అరుదైన అవకాశం లభించింది. వేసవి సెలవుల్లో రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు 152 మందిని సబ్జెక్టు రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్‌గా విద్యాశాఖ ఎంపిక చేసింది. మొత్తం 641 మంది దరఖాస్తు చేసుకోగా హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్వ్యూకు 393 మంది హాజరయ్యారు. ఇందులో సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకటరాములు తెలిపారు. దామరకుంట జడ్పీహెచ్ఎస్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య, అంగడికిష్టాపూర్ పూర్వ ప్రధానోపాధ్యాయుడు, ప్రస్తుత ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఓంకార్ రాధాకృష్ణ ఎస్ఆర్ పీలుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఒకే మండలం నుంచి ఇద్దరికి అవకాశం లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. వీరికి పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా ఫలప్రద యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

కొండపాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా సర్వేప్సిత ఫలప్రద యాగం ఘనంగా నిర్వహించారు. చెప్పెల హరి నాథశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమై లక్ష్మి గణపతి, రుద్ర, దేవీ నవావరణ, మూల మంత్ర సమ్మేళన సుబ్రహ్మణ్య త్రిశతి హవనములు, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సత్యం, క్షేత్ర కమిటీ సభ్యులు మర్యాల రవీందర్, విఠల్, మల్లికార్జున్, నర్సింహారెడ్డి, రాజేంద్రప్రసాద్, తిరుపతి రెడ్డి, మోహన్ దాస్, మల్లేశం, సాయి తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమ వద్దంటూ ఆందోళన



పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేపట్టిన గ్రామస్థులు

చిన్నశంకరంపేట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) పచ్చని వాతావరణంలో రసాయన పరిశ్రమ ఏర్పాటు చేయొద్దంటూ మండలంలోని చందంపేట గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సదరు పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తూ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇప్పటికే ఓ రసాయన పరిశ్రమతో అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెల క్రితం పరిశ్రమకు వ్యతిరేకంగా పంచాయతీ కార్యదర్శి పద్మ ఆధ్వర్యంలో తామంతా తీర్మానం చేసి మెదక్ డీఎల్పీవోకు అందజేసినా పనులు సాగిస్తుండడంపై మండిపడ్డారు. పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలన్నారు.

గౌరాయపల్లిలో వీరగల్లుల గుర్తింపు





చేర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామంలో వీరగల్లులను కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. నంగునూరుకు చెందిన ఆ బృంద పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ కొద్దిరోజులుగా పరిశీలన జరిపారు. మూడు వీరగల్లులలో ఒకటి రాష్ట్ర కూటరాజుల కాలం నాటిది కాగా, మిగిలిన రెండు 17వ శతాబ్దానికి చెందిన పులివేట వీరగల్లుగా ఉన్నట్లు తెలిపారు. వంగిన వెదురుగుడ కొసకు శైవభక్తుడు తన సిగముడిని కట్టుకుని అంజలి పట్టి యోగాసనంలో కూర్చుని ఉండగా, అతడి మెడ నరికి వేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి కత్తిచేతిలో పట్టుకుని పక్కనే కనిపిస్తున్నాడని వివరించారు. పై భాగంలో దైవసాన్నిధ్యాన్నిపొందిన వీరుడు కనిపిస్తున్న శైలిని బట్టి రాష్ట్రకూటుల కాలంనాటిదని బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు. మధ్యయుగచరిత్ర ఆనవాళ్లుగా ఉన్నాయని తెలిపారు.

మల్లన్న ఆలయ సమీపంలో చైన్‌స్నాచింగ్

● 6తులాల బంగారు ఆభరణం అపహరణ

చేర్యాల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చైన్‌స్నాచింగ్ చోటుచేసుకోవడం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. కొమురవెల్లి గ్రామానికి చెందిన వనపర్తి భాగ్యమ్మ మల్లన్న ఆలయ నుంచి తోట బావికి వెళ్లేమార్గంలోని గోశాల సమీపంలో చిరు కిరాణా వ్యాపారం నిర్వహించుకుంటూ జీవిస్తున్నారు. రోజులాగే మంగళవారం తెల్లవారు జామున సుమారు ఐదుగంటల సమయంలో రాజగోపుర దుకాణం వద్దకు చేరుకుని సామాగ్రి భద్రపరిచిన పరదాను తొలగిస్తున్నది. ముఖానికి గుడ్డను ధరించిన గుర్తుతెలియని వ్యక్తి వెనకనుంచి వచ్చి భాగ్యమ్మ తలను కిందికి అదిమిపట్టి మెడలోని ఆరు తులాల బంగారు గొలుసు అపహరించుకుని పరారయ్యాడు. 100 నంబరుకు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆలయ పరిసరాలలో బిగించిన సీసీ టీవీ ఫుటేజీలను సీఐ ఎల్ శ్రీను, ఎస్ఐ రాజు పరిశీలించినా నిందితుడి జాడ దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆలయ పరిసరాలలోని పలు సీసీ కెమెరాలు సక్రమంగా పని చేయడం లేదు. ఘటన చోటుచేసుకున్న ప్రదేశానికి చేరువన తోట బావికి వెళ్లేమార్గంలోని సీసీ కెమెరా పనిచేసి ఉండి ఉంటే ఇదేమార్గం గుండా నడుచుకుంటూ వెళ్లిన ఆగంతకుడి ఆచూకీ లభ్యమయ్యేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ వర్గాలు, పోలీస్ శాఖల మధ్య సమన్వయలోపంతో సీసీ కెమెరాల నిర్వహణపై చేతులెత్తేయడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. యేటా సీసీకెమెరాల నిర్వహణకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ధాన్యం బస్తాలు చోరీ



ఆటోలో నింపిన ధాన్యం బస్తాలు



పట్టుబడిన నిందితులు

కోహెడ, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) ఐకేపీ కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు చోరీకి గురయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బైరి కనకయ్య, కుమారుడు సతీష్‌లు 45 బస్తాల ధాన్యాన్ని పోరెడిపల్లి ఐకేపీ కేంద్రంలో సోమవారం విక్రయించారు. తీవ్రమైన ఎండతో హమాలీలు లారీలోకి బస్తాలు వేయకుండా అక్కడే పెట్టారు. సోమవారం రాత్రి కేంద్రంలోకి ఆటో వచ్చిన శబ్దం గమనించిన సమీపంలో నివసిస్తున్న కొందరు రైతులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే ఏపీ 36 టీఏ 3709 నంబర్‌గల ఆటోలో ధాన్యం బస్తాలను వేస్తున్నారు. వెంటనే రైతులు చుట్టుపక్కలవారిని అప్రమత్తం చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని డయల్ 100కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితులను విచారించగా హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందినవారుగా తేలింది. పలుమార్లు వివిధ కేంద్రాల వద్ద ధాన్యం ఎత్తుకెళ్లి హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ఒక వ్యాపారికి అమ్మినట్లు వెల్లడైంది. కాగా, బాధిత రైతు 6 క్వింటాళ్ల ధాన్యం ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ అభిలాష్ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మందుబాబు వీరంగం

● హనుమాన్ విగ్రహంపై పాదం మోపిన వైనం
● సామగ్రి, అమ్మవార్ల మండపాల ధ్వంసం



ధ్వంసమైన ఆలయ ఆవరణలోని అమ్మవార్ల మండపాలు



నిందితుడు అజయ్

చేర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వేచరేణి శివారు ఎల్లదాసునగర్ కాలనీకి చెందిన ఊపిరి అజయ్ తాగిన మైకంలో వీరంగం సృష్టించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం వేళ మద్యం సేవించిన అజయ్ కొమురవెల్లి-చేర్యాల ప్రధానరహదారి పక్కన గల హనుమాన్ దేవాలయంలోకి చొరబడి హనుమాన్ విగ్రహంపై పలుమార్లు పాదం మోపి అవమానపరిచాడు. ఆలయ ఆవరణలోని జలపోశమ్మ, ఉప్పలమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ దేవతామూర్తుల మండపాల పైకప్పులతో పాటు అద్దాలను ధ్వంసం చేశాడు. గమనించిన చుట్టుపక్కలవారు పట్టుకుని దేహశుద్ధిచేసి పరారీ కాకుండా తాడుతో కాళ్లు, చేతులు కట్టి వేసి పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, హనుమంత్ విగ్రహంపై పాదం మోపి మలినం చేసిన విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు అక్కడికి చేరుకుని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడికి ఒడిగట్టిన అజయ్‌ను శిక్షించాలని డిమాండ్ చేశారు.



విత్తన సంపదను కాపాడుకుందాం

● చిరుధాన్యాల్లోనే పోషకాలు అధికం
● డీడీఎస్-కేవీకే సలహాదారు డా.గౌరీశంకర్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య



మాట్లాడుతున్న డీడీఎస్-కేవీకే సలహాదారు డా.గౌరీశంకర్

జహీరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాల తరహాలో విత్తన సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని డీడీఎస్-కేవీకే సలహాదారు డా.గౌరీశంకర్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పస్తాపూర్‌లో అంతర్జాతీయ విత్తనదినోత్సవాన్ని నిర్వహించారు. 35 గ్రామాలకు చెందిన మహిళా రైతులు సుమారు 80 రకాల విత్తనాలను తీసుకువచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విత్తన సంపదను కాపాడుకోవడంలో రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఆహారధాన్యాల కొరత ఏర్పడుతుందన్నారు. 40 సంవత్సరాల క్రితం ఏర్పాటైన డీడీఎస్ మహిళా సంఘాలను అభివృద్ధి చేస్తూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నదన్నారు. డీడీఎస్ మహిళా రైతులు సంఘటితమై చిరుధాన్యాల విత్తనాలను పోగుచేయడం, పోషకాలిచ్చే చిరుధాన్యాలను పండించడం తమకు ఎంతగానో సంతృప్తినిస్తుందన్నారు. విత్తనాలను కాపాడుకునే సంస్కృతిని ముందుతరాలకు పరిచయం చేయాలని సూచించారు. అనంతరం బిడెకన్నె చంద్రమ్మ, హూమ్నాపూర్ లక్ష్మమ్మ, పూలమ్మ, సుక్కమ్మ, జనరల్ నర్సమ్మ, గుంజోటి నర్సమ్మ మొగులమ్మ, తదితరులు మాట్లాడుతూ విత్తనాలతోనే జీవనోపాధి లభిస్తుందని, విత్తన సంపదను డీడీఎస్ స్ఫూర్తితో కాపాడుకుంటున్నామన్నారు. విత్తనాలను తీసుకువచ్చిన రైతులకు డీడీఎస్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల రక్షణకు సహకరించాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

జిన్నారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం జిన్నారంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన అదనపు ఎస్పీ సంజీవరావుతో కలిసి హాజరై మాట్లాడారు. ఇటీవల జిన్నారంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, స్థానికేతరుల అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. కాగా, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో అరెస్టు అయిన వారిపై కేసులు ఎత్తివేయాలని స్థానికులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు నయిమోద్దీన్, రవీందర్‌రెడ్డి, వినాయక్‌రెడ్డి, ఎస్ఐ నాగలక్ష్మి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైరింగ్ రేంజ్ పనుల పరిశీలన



నార్సింగిలో ఫైరింగ్ రేంజ్ పనులను పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

చేగుంట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ గ్రామ శివారులోని పోలీస్ ఫైరింగ్ రేంజ్ పనులను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఫైరింగ్ ప్రాక్టీస్ కొరకు వేరే జిల్లాలకు వెళ్లాల్సి వచ్చేదని మెదక్ జిల్లాలోని నార్సింగ్‌లో పోలీస్ ఫైరింగ్ రేంజ్ పనులు వేగవంతం జరుగుతున్నాయని మే 2న ఐజి చేతుల మీద ప్రారంభోత్సవానికి సిద్ధమైందన్నారు. మెదక్ జిల్లా పోలీస్ సిబ్బంది ఫైరింగ్ రేంజ్ కల త్వరలోనే సహకారం అవుతుందన్నారు. ఆయన వెంట రామాయంపేట సిఐ వెంకటరాజా గౌడ్ , ఆర్ ఐ శైలేందర్, నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మొహినుద్దీన్. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'పహల్గాం' మృతులకు శ్రద్ధాంజలి

● ఐఐటీహెచ్ విద్యార్థులు, అధ్యాపకులు శాంతి ర్యాలీ



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు

కంది, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తీవ్రవాదానికి ఐఐటీహెచ్ వ్యతిరేకమని డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హెచ్‌లో ఆయన మంగళవారం సాయంత్రం విద్యార్థులు, అధ్యాపకులతో పహల్గాం మృతుల ఆత్మకు శాంతి కలుగాలని ఆకాంక్షిస్తూ కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు ఐఐటీహెచ్ ప్రాంగణంలో ర్యాలీ చేశారు. తీవ్రవాదానికి తమంతా వ్యతిరేకమని, పహల్గాం ప్రాణ నష్టం తమని కలిచి వేసిందని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. పహల్గాం బాధితులకు న్యాయం జరగాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడి పచ్చళ్ల తయారీ షురూ..

● ఒక కాయ ధర రూ.10 నుంచి రూ.15



అక్కన్నపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిల్వ పచ్చళ్ల తయారీకి ప్రాధాన్యమిస్తారు. ప్రధానంగా నోరూరించే మామిడి పచ్చడిని పెట్టేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపిస్తారు. ఈసారి మాత్రం పేద, మధ్యతరగతి ప్రజలకు మామిడి పచ్చడి తయారీ భారంగా మారింది. అకాలవర్షాలకు కాయలు రాలిపోవడంతో మిగిలిన కాయలను మార్కెట్‌లో సైజును బట్టి విక్రయిస్తున్నారు. హుస్నాబాద్ మార్కెట్‌లో ఒక మామిడి కాయ రూ.10 నుంచి రూ.15 వరకు, పెద్ద కాయ అయితే రూ.20 కూడా పలుకుతోంది. పచ్చళ్లకు ఉపయోగించే ఆయిల్, కారంపొడి, ఎల్లిగడ్డ, జిలకర, ఆవాలు, మెంతులు ధరలు కూడా భారీగానే పలుకుతున్నాయి. అయినా ప్రజలు మామిడి పచ్చడి పెట్టుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

మామిడికాయ పచ్చళ్ల రకాలు

పచ్చడి మామిడికాయలతో వివిధ రకాలుగా పచ్చళ్లు తయారు చేసుకోవచ్చు. ఆవకాయ, పెద్ద ముక్కల, ఎల్లిపాయ పచ్చడి, నువ్వులు, ఆవాలు, ఇలా రకరకాలుగా మామిడి పచ్చళ్లను పెట్టుకుంటున్నారు.

తయారీ ఇలా..

ఎండకాలంలో ఎవరి ఇంటికి వెళ్లిన మామిడి పచ్చడి గుమగుమలు నోరూరిస్తాయి. మార్కెట్‌లో మంచి రకంగా ఉండే మామిడికాయలను తీసుకొని వాటిని ముక్కలుగా చేసుకోవాలి. ముక్కలకు సరిపడా ఉప్పు, కారం, ఆవాల పొడి, జీలకర్ర, మెంతుల పొడి కలిపి ముక్కలకు పట్టించి ఊరబెట్టాలి. తర్వాత పోపు పెట్టి మామిడి పచ్చడి తినవచ్చు. ఇండ్లలో ఇలా తయారు చేసిన పచ్చళ్లను తమ కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్నవారికి పంపిస్తున్నారు.

ఎన్‌హెచ్ 365బీ అలైన్‌మెంట్ మార్పునకు కేంద్రం అంగీకారం



జాతీయ రహదారుల కార్యదర్శి ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, రైతులు

● రైతులకు నష్టం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం
● ఫలించిన ఎంపీ రఘునందన్‌రావు చొరవ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట-సిద్దిపేట మీదుగా సిరిసిల్లకు వెళ్లే 365బీ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. ఈ రహదారి ప్రాజెక్టు వలన పలు గ్రామాల్లో రైతులు విలువైన సాగుభూములను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో రైతుల తరపున మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చొరవ తీసుకొని, రైతుల ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లారు. జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమా శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. దుద్దేడ, ఎన్సాన్‌పల్లి, మర్పడగ, బురుగుపల్లి, ఖమ్మంపల్లి, తడక్కపల్లి, చిన్న గుండవెల్లి, పూల్లూరు, మల్యాల గ్రామాల్లో రైతులు కోల్పోతున్న భూముల వివరాలను అధికారికి వివరించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు, కాలువల నిర్మాణం కోసం ఇప్పటికే భూములను కోల్పోయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సుమారు ఒక గంట పాటు వివరించి, ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అధికారుల ముందుంచారు. రైతులకు భూముల నష్టం లేకుండా రాజీవ్ రహదారి, సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేసే మార్గాన్ని ప్రతిపాదించారు. ఈ అంశాన్ని అధికారులూ సానుకూలంగా స్వీకరించి, ప్రస్తుతం జరుగుతున్న భూ సర్వేను తాత్కాలికంగా నిలిపి వేసి, మార్గాన్ని పునఃపరిశీలించి, కొత్త అలైన్‌మెంట్ ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీతో సంబంధిత గ్రామాల్లోని రైతుల్లో ఆనందం, ఊపిరి పీల్చుకున్న భావం నెలకొంది. ఎంపీ రఘునందన్ రావు చూపిన చొరవ రైతుల భవిష్యత్‌కి రక్షణగా నిలిచిందని అన్నదాతలు అభినందిస్తున్నారు. భూముల్ని కోల్పోకుండా మా జీవనాధారాన్ని కాపాడుకునే మార్గం లభించింది. అంటూ రైతులు మడుపు రాంరెడ్డి, ఎరోళ్ల నర్సింలు, భైరినేని సందీప్ రావు, బొడిగె తిరుపతి, చెల్ల రాజలింగం ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు చింత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడానికే కొనుగోలు కేంద్రాలు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/చేగుంట/మనోహరాబాద్/శివ్వంపేట/వెల్దుర్తి/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ర్యాకల్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ పంటలను ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్‌చౌహాన్, నాయకులు వినోద్‌పాటిల్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, సంగారెడ్డి పాల్గొన్నారు. అలాగే పెద్దశంకరంపేట మండలం బూర్గుపల్లి, శివాయపల్లి, కమలాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పేట తహసీల్దార్ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం గోపాల్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధు, నాయకులు పాల్గొన్నారు. చేగుంట మండలం శేరిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మదూరు సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. అలాగే చేగుంట మండలంలోని చిన్నశివనూర్, కర్నాల్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో జయచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శివ్వంపేట ప్యాక్స్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట మహేందర్‌తో కలిసి ప్రారంభించారు. మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శివ్వంపేట ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట మహేందర్‌తో కలిసి ప్రారంభించారు. శివ్వంపేట మండల కేంద్రమైన శివ్వంపేట, దొంతి, గంగయ్యపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామంలో మదూరు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ మన్నన్, ఆరే రాజు, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ రైతులు వెల్దుర్తి- మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17న ఉప్పులింగాపూర్‌లో వెల్దుర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని, కానీ తాము అంతకుముందే కేంద్రం వద్ద ధాన్యాన్ని ఆరబోశామని చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు, సొసైటీ సిబ్బంది అధికారులతో మాట్లాడడంతో రైతులు ధర్నాను విరమించారు.

రైతుల ఇబ్బందులు దూరం చేసేందుకే 'భూ భారతి'



భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, పక్కన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/జోగిపేట/వట్‌పల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఇబ్బందులను దూరం చేయడం కోసం ధరణికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూభారతిని రూపొందించిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందన్నారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాదిలోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీంతో నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, రైతుల ప్రభుత్వమన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, స్థానిక ఆర్డీవో అశోక చక్రవర్తి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్సీ వెంకట్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, నాయకులు పాల్గొన్నారు. భూసమస్యలను తీర్చే పదునైన ఆయుధమే భూభారతి చట్టమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం జోగిపేటలోని శ్రీరామా గార్డెన్స్‌తోపాటు, వట్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధరణి స్థానంలో నూతన చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం నిపుణులతో కమిటీ వేసి పలు రాష్ట్రాల్లో పరిశీలించి రైతులకు సులువైన, పటిష్టమైన చట్టాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, ఆర్డీవో పాండు, తహసీల్దార్లు ఉమాకాంత్(అందోలు), శ్రీనివాస్(వట్‌పల్లి), అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, అందోలు డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

● గ్రామపంచాయతీ ఎదుట గ్రామస్థుల ఆందోళన



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

శివ్వంపేట/వెల్దుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకతీతంగా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మండల పరిధిలోని పాంబండ గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు వచ్చినా సోమవారం గ్రామంలో తిరిగిన కాంగ్రెస్ నాయకులు తమ ఇళ్లను ఎంపిక చేయడం లేదని పెద్దకోళ్ల కవిత, పోచయ్య, నీరుడి నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ వాడలో మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు వడ్ల భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ భూమయ్య, కుమ్మరి నర్సింలు తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని వెల్దుర్తి మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌తండాకు చెందిన అరుణ మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి అధికారులను వేడుకున్నది. మీ గ్రామానికి పంచాయతీ కార్యదర్శితో పాటు అధికారులు వచ్చినప్పుడు వివరాలు తెలపాలని అధికారులు సూచించారు.

ఉల్లాస్‌తో వయోజన విద్యకు ఊతం



మాట్లాడుతున్న నగేష్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్‌తో వయోజన విద్యకు ఊతం లభిస్తుందని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉల్లాస్ లక్ష్యాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వార నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి మహిళా స్వయం సహాయక సంఘాల నిరక్షరాస్యుల వివరాలను ఉల్లాస్ మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, పీడీ డీఆర్‌డీఏ శ్రీనివాస్‌రావు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రతల పట్ల రోడ్డు భద్రతా జిల్లాస్థాయి నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహిళకు దక్కిన బార్ అండ్ రెస్టారెంట్

మెదక్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలో మూడేళ్లుగా మూతపడ్డ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు జిల్లా ఎక్సైజ్‌శాఖ టెండర్లు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ లాటరీ పద్ధతి ద్వారా దక్కించుకుంది. ఇటీవల ఎక్సైజ్ అధికారులు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరగా.. 20 మంది సమర్పించారు. మంగళవారం మెదక్‌లోని కలెక్టరేట్ ప్రజావాణి హాలులో అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొబేషనరీ ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ముందుగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు సంబంధించి దరఖాస్తుదారులకు సూచనలు, సలహాలు, లాటరీ ప్రక్రియ నిబంధనలు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ లాటరీ తీసి విజేత నెంబర్ 14గా హైదరాబాద్‌కు చెందిన శోభను ప్రకటించారు. డిప్యూటీ కమిషనర్ హరికిషన్, ప్రొబేషన్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మరొకరి ప్రాణదానం లాంటిదని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. బసవ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బసవ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు బాధాకరం

చేగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ లైసెన్స్ ఉన్న కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు చేయడం చాలా బాధాకరమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ జిల్లా నందిపేటలో గౌడ సంఘ సమావేశానికి వెళ్తుండగా మార్గమధ్యలో నార్సింగి గౌడ సంఘం సభ్యుల కోరిక మేరకు నార్సింగి రేణుకాఎల్లమ్మను దర్శించుకుని పూజలు చేశారు. గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌కు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌడ కులస్థులపై ఎక్సైజ్ దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశం, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై దృష్టి సారించాలి

కొండాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న సూచించారు. మంగళవారం కొండాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో సంవత్సరం ముగింపు రికార్డులను పరిశీలించి, మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను పరిశీలించి, నమోదు ప్రక్రియను వెంటనే నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్,సిబ్బంది పాల్గొన్నారు.

జీపీల పెండింగ్ బిల్లులు ఎప్పుడిస్తారు..?

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పదినెలల నుంచి పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీల బిల్లులను ఇంకెప్పుడు విడుదల చేస్తారని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం మంగళవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యేడాదిన్నర కాలంగా గ్రామాల్లో సర్పంచులు లేకపోయినా పంచాయతీ కార్యదర్శులు అన్ని తామై పనులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సొంత డబ్బులు వెచ్చించి పనులు చేస్తున్నామని, ఇలాగే కొనసాగితే కార్యదర్శుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీల బకాయి బిల్లులు విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అక్రమ నిర్మాణం పరిశీలన

రామచంద్రాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ బీమాక్ కాలనీ (బీహెచ్‌ఈఎల్ కార్మికుల గృహ సముదాయాలు)లో అక్రమ నిర్మాణాన్ని తహసీల్దార్ సంగ్రాంరెడ్డి పరిశీలించారు. కార్మికుల గృహాలు హెచ్‌ఎండీఏ అనుమతితో నిర్మించినట్టు తెలుసుకున్నారు. దీన్ని గేటెడ్ కమ్యూనిటీగా గుర్తించారని స్థానికులు తహసీల్దార్‌కు వివరించారు. ఈ మధ్యలో ఉన్న 1200 గజాలను బిల్డర్ ప్రవేటు వ్యక్తికి విక్రయించారని స్థానికులు తెలిపారు. ప్రవేటు వ్యక్తి నిర్మాణానికి మున్సిపల్ నుంచి అనుమతి అనుమతి పొందినట్టు తహసీల్దార్ విచారణలో గుర్తించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇప్పుడు ఏం చేద్దాం మంటూ సొసైటీ సభ్యులను ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ విషయమై వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' రెండు రోజుల నుంచి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఉపాధిహామీలో భారీగా అక్రమాలు

● సామాజిక తనిఖీలో బహిర్గతం



వట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ బాలరాజు

వట్‌పల్లి/శివ్వంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రైతు కూలీలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో భారీగా అక్రమాలు బయటపడ్డాయి. వట్‌పల్లిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఉపాధిహామీ పనులకు సంబంధించి నాల్గవ విడత సామాజిక తనిఖీపై ప్రజాదర్బార్ నిర్వహించారు. వారంరోజులుగా మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు ఉపాధిహామీ పనులకు సంబంధించి విచారణ జరిపారు. ఈ సందర్భంగా డీఆర్డీవో పీడీ బాలరాజు మాట్లాడుతూ మండలంలో చేపట్టిన ఉపాధిహామీలో రూ.3.61 కోట్ల పనులకు సంబంధించి విచారణ జరిగిందని, గ్రామపంచాయతీ పనులకు సంబంధించి రూ.2 కోట్ల 34 లక్షల 51 వేల పనుల రికార్డులు అందించలేదని అధికారులు వెల్లడించారు. కాగా ఉపాధిహామీ పనుల్లో రూ.55 వేల అక్రమాలు జరిగినట్లు వెల్లడి కావడంతో రికవరీకి ఆదేశించామని పీడీ బాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీడీవో అంజయ్య పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, అడిషనల్ డీఆర్డీవో రంగాచార్యులు హాజరయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 37 గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ ప్రజావేదికలో అక్రమాలు బహిర్గతమయ్యాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.6.30 కోట్ల పనులు, పంచాయతీరాజ్‌శాఖలో రూ.2.32 కోట్లు, అటవీశాఖలో రూ.22.77 లక్షల పనులు నిర్వహించారు. గోమారంలో పనులు చేయని వారి పేరిట మస్టర్లు రాసినట్లు ప్రజావేదికలో బయటపడింది. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఉపాధి పనులపై ఆరా

ఝరాసంగం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఝరాసంగంలో చేపడుతున్న ఉపాధిహామీ పని ప్రదేశాన్ని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మంగళవారం సందర్శించి, కూలీలతో మాట్లాడారు. కూలీలకు రోజుకు రూ.307 వచ్చే విధంగా పనులు నిర్వహించాలన్నారు. ఎంతమేరకు పనులు చేస్తే.. ఏమేరకు డబ్బులు వస్తాయని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని కుప్పానగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చెరకు బిల్లులు రాక ఇబ్బందులు

మనూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మూడునెలలు అవుతున్నా చెరకు బిల్లులు చెల్లింపుల్లో మాగి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పలువురు చెరకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనూరు మండలంలో చెరకు పంట అధికంగా సాగు అవుతుందని, జనవరి, ఫిబ్రవరిలో చెరకు ఫ్యాక్టరీకి వెళ్లినా ఇప్పటివరకు బిల్లులు అందలేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు అవుతున్నాయన్నారు. దీనిపై అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యం, స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని చెరకు రైతులు కోరుతున్నారు.

రాగి అంబలి పంపిణీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కిషన్‌నాయక్‌తండాలో మంగళవారం సేవాలాల్‌మహరాజ్, భవానీమాత మందిరాల మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకాగా.. వారికి పౌష్టికాహారాన్ని అందించాలని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ సూచనతో మొబైల్ వాహనం ద్వారా ఫౌండేషన్ ప్రతినిధులు పరశురాంరెడ్డి, తుకారం, శ్రీనివాస్, అభిపవార్ వెళ్లి భక్తులకు ఉచితంగా రాగి అంబలిని పంపిణీ చేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన

నారాయణఖేడ్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : విశ్వగురు మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఖేడ్‌లోని బసవ మంటపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంతో పాటు ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఇందులో 63 మంది యువకులు రక్తాన్ని దానం చేశారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్ట్ అప్రజాస్వామికం

నిజాంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల సమస్యలను మంత్రి సీతక్కకు వివరించేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులు అంగన్‌వాడీలకు సైతం ఇవ్వాలన్నారు. కనీస వేతనం రూ.17 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక కోసం విచారణ

నర్సాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎంపీడీవో మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని రుస్తుంపేట, రంజ్యాతండా, ఎర్రకుంటతండాలో దరఖాస్తు చేసుకున్న వారి జాబితా ఆధారంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. వారు అర్హులా కాదా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ కోసం భవనం పరిశీలన

తూప్రాన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో నూతన డిస్పెన్సరీ కోసం ఆర్డీవో జయచంద్రారెడ్డి పోతరాజ్‌పల్లి గ్రామంలోని భవనాన్ని పరిశీలించారు. పట్టణంలోని పురాతన డిస్పెన్సరీ పలు కారణాల వల్ల ఇబ్బందులు వచ్చాయన్నారు. గతంలో అద్దె చెల్లించకపోవడంతో డిస్పెన్సరీని పలుమార్లు మూసేశారన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉచిత న్యాయ సహాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్యానెల్ అడ్వకేట్ సోమశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బూచనెల్లి శివారులో ఏర్పాటుచేసిన మంగళట్యూబ్ పరిశ్రమలో కార్మికులకు, చట్టాలు, న్యాయ సహాయం, పని ప్రదేశాల్లో అందించే సేవలు తదితరాలపై అవగాహన కల్పించారు.

సభ్యులను ఆదుకోవడం మా బాధ్యత: పీఆర్టీయూ

జోగిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : సభ్యులను ఆదుకోవడమే తమ ముఖ్య బాధ్యత అని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఆయన, జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్యతో కలిసి మండలంలోని మక్తగూడెంకు వచ్చారు. ఫిబ్రవరిలో ఆకస్మికంగా మృతిచెందిన ఉపాధ్యాయుడు విష్ణువర్ధన్ కుటుంబాన్ని వారు పరామర్శించి, రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల బాధ్యులు రాజమల్లు, మాయాచారి, అర్బన్ బాధ్యులు నరోత్తం, జనార్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమే టార్గెట్

5వ పేజీ తరువాయి

వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

నిఘా ఏదీ....?

ఇంటికి తాళం వేయాలంటేనే జనం భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో సీసీ కెమెరాల నిఘా నిరంతరం ఉందని చెబుతున్న పోలీసులు దొంగతనాలను మాత్రం అరికట్టకపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం పెరుగుతున్న దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారుతోంది. దొంగతనాలు జరుగుతున్న ఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నప్పటికీ దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

పోలీసుల సూచనలివే..

దొంగతనాలను నియంత్రించేందుకు ప్రజలకు పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని, ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలని సూచిస్తున్నారు. ఇంటి లోపల, బయట లైటు వేసి ఉంచాలని చెబుతున్నారు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలని, వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలని సూచిస్తున్నారు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు. తమ ప్రాంతం పరిధిలోని పోలీస్‌స్టేషన్ అధికారి ఫోన్ నంబర్, ఇతర అధికారుల నంబర్‌లు తమ సెల్‌ఫోన్‌లలో ఉంచుకోవాలని కోరుతున్నారు.

ఆధార్ సైట్‌లో వేలిముద్రలతో..

వేలిముద్రలు వుంటే ఎవరనేది, ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అనే సమాచారమంతా ఆధార్ సైట్ ద్వారా తెలిసిపోతుంది. దొంగతనాలు జరిగిన కేసుల్లో ఘటనా స్థలం నుంచి దొంగల వేలి ముద్రలను పోలీసులు సేకరిస్తుంటారు. ఆ వేలిముద్రలు ఆధార్ సైట్ ద్వారా ఎవరివి అని తెలుసుకొనే సాంకేతికత అందుబాటులోకి తీసుకొస్తేదొంగలను సులువుగా పట్టుకొనేందుకు వీలవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: ఎమ్మెల్యే

శివ్వంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దంతాన్‌పల్లికి చెందిన గేడి భూమయ్య, కుల్ల నర్సింలుకు మంజూరైన రూ.72 వేల చెక్కును అందజేశారు.

నియోజకవర్గానికి రూ.2 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ సహాయం

నర్సాపూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నర్సాపూర్ నియోజకవర్గంలోని పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నిధులు గతంలో ఎప్పుడు లేనంతగా రెండుకోట్లకు పైగా మంజూరయ్యాయని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024 నుంచి ఇప్పటివరకు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో రూ.2,15,81,900 కోట్లను ఆయా బాధితులకు అందజేశామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహకు నియోజకవర్గం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్, గౌరవ అధ్యక్షుడు ధనంజయ, అధ్యక్షుడు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

● ఉగ్రవాదుల కాల్పులకు నిరసనగా ర్యాలీ



సంగారెడ్డిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మంజీరా బ్రాంచ్-సంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిరసన చేపట్టారు. సంగారెడ్డిలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ మృతిచెందిన పర్యాటకులకు డాక్టర్లు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డా.కిరణ్‌కుమార్, కార్యదర్శి డా.ఎస్.ఆనంద్, కోశాధికారి డా.హరినాథ్‌రెడ్డి, డా.సురేశ్, డా.రాజుగౌడ్, డా.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'నాయీబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలి'

పుల్‌కల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అందోల్ కృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దశాబ్దాల తరబడి నాయీబ్రాహ్మణులు ఆర్థికంగా అసమానతలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వృత్తి తప్పా ఏ ఇతర రంగాల్లో రాణించడం లేదని విచారం వ్యక్తం చేశారు. అనంతరం చౌటకూర్ గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అంసాన్‌పల్లిలో తాగునీటి కటకట

కొల్చారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామం తాగునీటి కోసం అల్లాడుతోంది. 20 రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు కూలీ పనుల కెళ్లి వచ్చేసరికి ఇంట్లో నీళ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గ్రామంలోకి మిషన్ భగీరథ నీళ్లు కూడా రాకపోవడంపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కోరారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

కొల్చారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో పాఠశాల ఆవరణ మొత్తం నీటితో నిండిపోయింది. అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

రామాయంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట మండల పరిధి కాట్రియాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి సంయుక్త నిర్వహణలో 260 మందికి వైద్య పరీక్షలతో పాటు కొందరికి ఈసీజీ పరీక్షలు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజీలుద్దీన్, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేమే యాదగిరి, చిలుక గంగాధర్, అర్జున్‌సింగ్ పాల్గొన్నారు.